# నేనూ నీతో వస్తున్నాను ::

పులిపాక
జగన్నాథరావు

అయ్యో నాయనా! పాతికేళ్ళకే నీకు నూరేళ్ళూ నిండాయా! వెన్నులో కత్తి పోటుతో నువ్వు బాధపడుతూంటే కన్న తల్లిని నేనే చూడలేక నీ చావుకు ఇష్టపడ్డాను. ఈ మతకలహాలకు కారకులైన వారికి మన ఉసురు తగలకుండా ఉండేటందుకు మనం దేవుణ్ణి ప్రార్థిద్దాము. మనమే శపిస్తే వాళ్ళ పాపఫలాలకు అంతుఉంటుందా! మనలను చరిత్ర గుర్తుపెట్టుకోదు. మనల్ని దేశం బాగుకోసం బ్రతుకున్నామనే మనుష్యులూ తేలికగానే మరిచిపోతారు. ఈ రెండూ చాలా మంచి విషయాలే! ఐతే మనకు ఈ తృప్తిమాత్రం ఉండకపోదు. మనం సత్యంగాను, అమాయకంగాను జీవించాము. పసిపాప జీవితంలోని అమాయకత్వంతో సత్యంగా బ్రతకటం ఎంత గొప్పవిషయమో రాజకీయాలను నడిపించే మనుష్యులు గమనిస్తే బాగుండును. దానికనే నేను నీ జీవితాన్ని చూసి గర్వపడుతున్నాను నాయనా! 'నేను అనంతమైన ఆత్మసంతృప్తితో ధైర్యంగా చనిపోతున్నానమ్మా, ప్రపంచంలో నాకు నీ వొడిలో తలపెట్టుకొని చనిపోవటంకంటె కావల్సిందేమిటి!' అన్నావు నువ్వు. అవును నాయనా, నిజమే! అప్పుడు ఆ మాటలంటున్నప్పుడు నీ ముఖం కాంతితో వెలిగింది. రైల్వే పోలీసు ఉద్యోగం చేస్తున్నప్పుడు ఓ నాటి ఉదయం నువ్వన్నమాటలు నాకు గుర్తుకు వస్తున్నై:—'రాత్రి రైలుపట్టాల మీద ఓ మనిషిని కట్టివేసి హత్యచేశారు ఎవరో. రైలు మధ్యలో ఆగిపోయింది. అటు ఐదుమైళ్ళల్లోనూ, ఇటు ఐదుమైళ్ళల్లోనూ స్టేషనులేదు. నన్ను ఒంటరిగా శవాన్ని కనిబెట్టుకొని ఉండమన్నారు—పక్కస్టేషను నుంచి రైలుతిరిగి వచ్చేవరకు నాకు భయంవేసింది. పక్కన శవమూ, ఒంటరిగా నేనూ, కాని నిన్ను తలుచుకున్నాను. భూమాతను తలుచుకున్నాను. శ్రీరాముణ్ణి—నా దేవుణ్ణి తలుచుకున్నాను. కాని నేను పిరికివాణ్ణి. ఇంతపిరికివాణ్ణి ఎలా కన్నావమ్మా' అన్నావు నువ్వు. కాని నాయనా! నువ్వూ హత్యచేయబడ్డావు అంతకంటె దారుణంగా. నేనూ ఒంటరిగా నేశవాన్ని కనిబెట్టుకొని ఉన్నాను. నీకు దహన సంస్కారాలు నేను ఒంటరిగా చేయలేను నాయనా! ఏదో బలహీనత—నీ పిరికితనంకన్నా దుర్బలమైన, అసహ్యమైన బలహీనతనన్నావరిస్తున్నది నాయనా! మనిద్దరినీ భూమాతే మట్టి చేయాలని మనం ఆశిద్దాము. 'కామంచే తలచరాని పవిత్రమూర్తి స్త్రీ' అని నువ్వు వివాహం చేసుకోవటం మానివేశావు. నాయనా! నీ ఆ తలంపూ, నువ్వుచేసినపనీ గొప్పదైనా కాకపోయినా తప్పకుండా చాలా అదృష్టంతో కూడినదే! దేనికంటె మరోప్రాణి నువ్వు చనిపోవటంవల్ల నీ తదనంతరం జీవించటం సంభవించినట్లయితే—ఎంత మనోవేదన చెందేదో! నువ్వు చనిపోయిన తరువాత కూడా మనిషికీ, దేవుడికీ సేవచేస్తూ పవిత్రంగా బ్రతకటమే నా ఆశయంఐనా నాలో ఆ శక్తిలేదు నాయనా! నువ్వు నేను కన్న సంతానానివి. కనుకనే నాయనా, నేనూ నీతో వస్తున్నాను.